సాక్షి కామారెడ్డి

శనివారం । 18 । అక్టోబర్ । 2025

I



జోరుగా అక్రమ నిర్మాణాలు

పిట్లంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇంటి కోసం అనుమతి తీసుకొని దుకాణాలను నిర్మిస్తున్నారు.

- IIIలో ▸



ఎక్కడి వడ్లు అక్కడే..

జిల్లాలో 15 రోజుల క్రితం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ఇంకా ప్రారంభించలేదు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
34.9 /19.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. రోజంతా మబ్బులతో కూడిన ఎండ ఉంటుంది.

న్యూస్‌రీల్

మానవ అక్రమరవాణా నిర్మూలన అందరి బాధ్యత

• బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



బాన్సువాడ: మానవ అక్రమరవాణాను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ అసిస్టెంట్లకు రెండ్రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మానవుల అక్రమ రవాణాను నిర్మూలించడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ లక్క నరహరి, ఫౌండేషన్ ప్రతినిధులు సిరజ్, సంజీవులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 19, 20 తేదీల్లో సీహెచ్ శ్రీనివాస్ స్మారక రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ కబడ్డీ టోర్నీ నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ ప్రతినిధులు సీహెచ్ రాజు, జి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని వీరేశ్, ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. మ్యాట్‌పై నిర్వహించే ఈ పోటీలకు ఇప్పటికే 15 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయని తెలిపారు.

మద్యం దుకాణాలకు 833 దరఖాస్తులు

కామారెడ్డి రూరల్: జిల్లాలోని మద్యం దుకాణాలకు శుక్రవారం 414 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మొత్తం 49 దుకాణాలకు ఇప్పటి వరకు 833 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకు 240, ఎల్లారెడ్డి స్టేషన్ పరిధిలో 7 దుకాణాలకు 154, బాన్సువాడ స్టేషన్ పరిధిలో 9 దుకాణాలకు 131, దోమకొండ స్టేషన్ పరిధిలో 8 దుకాణాలకు 172, బిచ్కుంద స్టేషన్ పరిధిలో 10 దుకాణాలకు 131 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

దోమకొండ: దోమకొండ గడికోటలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలను నిర్వహించనున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కదిరె మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తారని వారు వివరించారు.

తెయూలో స్పాట్ అడ్మిషన్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో 2025–26 విద్యాసంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ వాసం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 21 మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. అదేరోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్లు ఇస్తారని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు వెంట తీసుకుని వచ్చి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని సూచించారు. స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని, హాస్టల్ వసతి కూడా ఉండదన్నారు. అభ్యర్థులు టీసీ, అకడమిక్ సర్టిఫికెట్లు, అడ్మిషన్ రసీదు, అవసరమైన ఇతర పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కూటమి కుట్రలపై.. వెల్లువెత్తిన నిరసన



కామారెడ్డి జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజా సమస్యలపై వార్తలు, కథనాలతో ప్రశ్నిస్తున్న 'సాక్షి' మీడియాపై ఏపీలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని జర్నలిస్టు, ప్రజా, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. సాక్షితోపాటు ఎడిటర్ ధనంజయ రెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి, బాన్సువాడ, నిజాంసాగర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

- కామారెడ్డి టౌన్/ బాన్సువాడ/ బాన్సువాడ రూరల్ / నిజాంసాగర్



సాక్షికి మద్దతుగా బాన్సువాడలో ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు, జర్నలిస్టులు

జన జీవనమా? అజ్ఞాతమా?

ఆపరేషన్ కగార్‌తో దండకారణ్యంలో నక్సలైట్ ఉద్యమం ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. వరుస ఎన్‌కౌంటర్లు, అరెస్టులకు తోడు ఇటీవలి కాలంలో జరుగుతున్న లొంగుబాట్లతో ఆ పార్టీ మరింత దెబ్బతింటోంది. అయితే కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఏడుగురు దశాబ్దాల కాలంగా నక్సలైట్ ఉద్యమంలో కొనసాగుతున్నారు. వారంతా ఎక్కడున్నారు? వాళ్లదారి ఎటువైపు అనేదానిపై చర్చ జరుగుతోంది.



మనోళ్ల దారెటు..

- ఉమ్మడి జిల్లా నుంచి అజ్ఞాతంలో ఏడుగురు
- ఎస్‌జెడ్‌సీ మెంబర్ హోదాలో స్వామి
- వివిధ స్థాయిల్లో పలువురు



స్వామి అలియాస్ లోకేటి చందర్



సంతోష్ అలియాస్ ఎర్రగొల్ల రవి



లోకేటి రమేశ్



లోకేటి లావణ్య అలియాస్ శాంతి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : దేశంలో నక్సలైట్లు లేకుండా చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌కు పదును పెట్టి దండకారణ్యాన్ని జల్లెడ పడుతోంది. కొంత కాలంగా భద్రతాదళాలు జరుపుతున్న కాల్పుల్లో వందలాది మంది చనిపోయారు. మరెందరో అరెస్టయ్యారు. లొంగుబాట్లు కూడా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అజ్ఞాత నక్సల్స్ ఎక్కడున్నారు? వాళ్ల దారి ఎటువైపు ? అన్నదాని గురించి చర్చ జరుగుతోంది. కామారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలోని ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన లోకేటి చందర్ అలియాస్ స్వామి బస్తర్‌లో స్పెషల్ జోనల్ కమిటీ (ఎస్‌జెడ్‌సీ) సభ్యుని హోదాలో పనిచేస్తున్నట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఆయన మూడు దశాబ్దాల కాలంగా విప్లవోద్యమంలో ఉన్నారు. అప్పట్లో నిజామాబాద్ జిల్లా పడ్కల్‌లో 36 గంటలకు పైగా సాగిన ఎన్‌కౌంటర్‌లో స్వామి తప్పించుకున్న తీరు గురించి రకరకాలుగా చెప్పుకుంటారు. సుదీర్ఘకాలంగా అజ్ఞాతంలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో నక్సల్స్ ప్రభావం ఉన్న అన్ని ప్రాంతాల్లో స్వామి సుపరిచితుడు. రెండు దశాబ్దాల కిందట అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తీవ్ర నిర్బంధం విధించడంతో స్వామిని దండకారణ్యానికి పంపించారు. అప్పటి నుంచి ఆయన తిరిగి జిల్లా వైపు రాలేదని చెబుతారు. తండ్రి చనిపోయినా, ఇటీవల తల్లి చనిపోయినా ఇంటి ముఖం చూడలేదు. అయితే స్వామి భార్య లోకేటి సులోచన అలియాస్ నవత కూడా కొంత కాలానికే ఆయన వెంట నడిచింది. దళ కమాండర్‌గా సౌత్ బస్తర్ ప్రాంతంలో పనిచేస్తుండగా ఏడెనిమిదేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోగా అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రులిద్దరూ అజ్ఞాతంలో ఉండడంతో పిల్లలిద్దరూ బంధువుల వద్ద ఉండి చదువుకున్నారు. అయితే 2009లో వాళ్లిద్దరూ కూడా అడవిబాట పట్టారు. స్వామి కొడుకు లోకేటి రమేశ్ సౌత్ బస్తర్ కొంటా ఏరియాలో డీసీఎంగా పనిచేస్తునట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఆయనపై రూ.4 లక్షల రివార్డుంది. అలాగే స్వామి కూతురు శాంతి అలియాస్ లోకేటి లావణ్య కూడా అన్నతో కలిసి అడవిబాట పట్టింది. తల్లిదండ్రులతోపాటు ఇద్దరు పిల్లలు కూడా అజ్ఞాతంలోనే ఉండగా తల్లి సులోచన అనారోగ్యంతో చనిపోయింది. కాగా స్వామి, రమేశ్, లావణ్య ముగ్గురూ వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్నట్టుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. పాల్వంచ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్ దినేశ్ అలియాస్ సంతోష్ 2001లో అజ్ఞాతంలోకి వెళ్లినట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఆయన దళ కమాండర్ హోదాలో ఉన్నారు. ఇతనిపై రూ.5 లక్షల రివార్డు ఉంది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి 1999 నుంచి అజ్ఞాతంలో ఉన్నారని, ఆయన ఏ స్థాయిలో పనిచేస్తున్నది మాత్రం పోలీసుల రికార్డుల్లో పేర్కొనలేదు. అతనిపై రూ.లక్ష రివార్డు ఉంది. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం లింగాపూర్‌కు చెందిన ఒకరు, డిచ్‌పల్లి మండలం ఇందల్వాయికి చెందిన మరొకరు దండకారణ్యంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నట్టు సమాచారం.

పోలీసుల అదుపులో లావణ్య?

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గంగులూరు ప్రాంతంలో కామారెడ్డి జిల్లా ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన మావోయిస్టు నాయకురాలు లోకేటి లావణ్య అలియాస్ శాంతి పోలీసులకు చిక్కినట్టు తెలుస్తోంది. ఏరియా కమిటీ మెంబర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసు రికార్డుల్లో ఉంది. ఆమెపై రూ.4 లక్షల రివార్డు ఉంది. లావణ్య అరెస్టు అయ్యిందా ? లొంగిపోయిందా ? ఎక్కడ ఉన్నది తెలియరాలేదు. అలాగే లోకేటి రమేశ్ తనతో కలిసి పనిచేస్తున్న దళసభ్యురాలిని వివాహమాడినట్టు సమాచారం. రమేశ్ భార్య కూడా ఇటీవల అరెస్టయి జైల్లో ఉన్నట్టు తెలుస్తోంది.

లక్ష్యంతో ముందుకు సాగాలి

- విద్యార్థులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉద్బోధ
- భిక్కనూరు హైస్కూల్ తనిఖీ



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

భిక్కనూరు: ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగితే వారి భవిష్యత్తు బంగారుమయం అవుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉద్బోధించారు. శుక్రవారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయుడిలా మారి పదో తరగతి విద్యార్థులకు సౌర వ్యవస్థపై పాఠాలను బోధించారు. పాఠశాలలు విద్యాగణనకు కేంద్ర బిందువులుగా నిలుస్తాయన్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందజేస్తున్న విషయంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇస్రో సందర్శనకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను కలెక్టర్ అభినందించి వారికి నోటు పుస్తకాలను అందజేశారు. మరిన్ని పరిశోధనలు నిర్వహించి విద్యార్థులను ముందుకు తీసుకెళ్లాలని సైన్స్ టీచర్ తమ్మల రాజుకు సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో రాజు, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

• కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. దళారులకు విక్రయించి నష్టపోవద్దని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వరి పంటకు మద్దతు ధర పోస్టర్లను ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం శ్రీకాంత్, డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ సమర్థవంతంగా చేపట్టాలి



తాండూర్‌లో రైతులతో మాట్లాడుతున్న డీసీవో రామ్మోహన్

• డీసీవో రామ్మోహన్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా సహకార శాఖ అధికారి రామ్మోహన్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద, గోలిలింగాల, లింగంపల్లి కలాన్, నాగిరెడ్డిపేట, తాండూర్, కిచ్చన్నపేట గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాలకు చేరిన ధాన్యం తేమ శాతాన్ని డీసీవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 427 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, సహకార శాఖ ఆధ్వర్యంలో 233, ఐకేపీ ఆధ్వర్యంలో 194 కేంద్రాలను ప్రారంభించారన్నారు. ఖరీఫ్‌లో 5,99,212 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగుతుందని అంచనా వేశామన్నారు. మరో మూడు రోజులలో ధాన్యం సేకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆయన వెంట ఎల్లారెడ్డి క్లస్టర్ అధికారి శ్రీనివాస్, మాల్తుమ్మెద, తాండూర్ సొసైటీల సీఈవోలు సందీప్, చంద్రమురళి తదితరులు ఉన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ కరోల, వేదికపై ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

• ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ కరోల

నిజాంసాగర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే పదవులు దక్కుతాయని ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు రాజ్‌పాల్ కరోల పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకుల అభీష్టం మేరకు డీసీసీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం నిజాంసాగర్ గుల్‌దస్తా వద్ద జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌కు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలన్నారు. 30 ఏళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడుతున్నారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు జుక్కల్ నియోజకవర్గానికి మంత్రి పదవి లేదని, కనీసం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఇస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, హన్మాండ్లు, రమేశ్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

అరవింద్ అడ్డగింత

డీసీసీ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేసేందుకు వచ్చిన సౌదాగర్ అరవింద్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడంతో అధిష్టానం అరవింద్‌ను సస్పెండ్ చేసినట్లు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అడ్డు చెప్పారు. దీంతో స్థానిక పోలీసులు అరవింద్‌ను సమావేశం నుంచి బయటకు పంపించారు.

కేసులు పెండింగ్‌లో ఉంచొద్దు

- విచారణ త్వరగా పూర్తిచేయాలి
- నెలవారీ సమీక్షలో ఎస్పీ రాజేశ్‌చంద్ర



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి క్రైం: పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కేసుల వివరాలు, చేపడుతున్న విచారణ తదితర విషయాలను స్టేషన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల పరిష్కారంలో జాప్యం తగదన్నారు. గ్రేవ్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించడంతోపాటు ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. గ్రామాల వారీగా పోలీసు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలతో సత్సంబంధాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణలో భాగంగా నిత్యం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. దొంగతనాలు జరగకుండా గస్తీ నిర్వహించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి అలసత్వం వహించొద్దని ఆదేశించారు.

పేకాటపై ప్రత్యేక నిఘా..

దీపావళి వేడుకలను సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ సూచించారు. టపాకాయలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పేకాటపై ప్రత్యేక నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. పేకాడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 164 సెల్‌ఫోన్ల రికవరీ

• ఎస్పీ రాజేశ్‌చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఆందోళనకు గురికావొద్దని, జిల్లా వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 164 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని ఎస్పీ రాజేశ్‌చంద్ర పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. సీఈఐఆర్ విధానంతో సెల్‌ఫోన్ రికవరీ చేసేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో 15 రోజుల క్రితం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో బాధితులు పోగొట్టుకున్న, చోరీకి గురైన 164 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,579 సెల్‌ఫోన్లు, సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 4,026 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు వెల్లడించారు. వాటి విలువ దాదాపు రూ.6.45 కోట్ల వరకు ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతోపాటు వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయించాలని సూచించారు. ఆలస్యం చేస్తే వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలిగే అవకాశం ఉంటుందన్నారు. రికవరీలో ప్రతిభ కనబరిచిన బృందం సభ్యులను ఎస్పీ అభినందించారు. రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు తెలియజేస్తామని, జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆర్ఎస్సై బాల్‌రాజు (87126 86114)ను సంప్రదించి ఫోన్లు తీసుకెళ్లాలని సూచించారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో ఈనెల 24 నుంచి నిర్వహించనున్న రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని కోరుతూ ఎల్లారెడ్డి సొసైటీ వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్ గౌడ సంఘం సభ్యులతో కలిసి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు శుక్రవారం ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, నారాగౌడ్ తదితరులున్నారు.

చదువులతోపాటు క్రీడలూ అవసరమే



పిట్లం(జుక్కల్): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమేనని, క్రీడలు విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పిట్లం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. మార్చ్ ఫాస్ట్‌లో పిట్లం బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి నిగెలుచుకున్నారు. ఎంఈవో దేవిసింగ్, ఆ యా ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు,నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక



చెట్కూరి మహిపాల్ ,దేవునిపల్లి పోచయ్య

కామారెడ్డి రూరల్: మండల బీజేపీ కార్యవర్గాన్ని పార్టీ మండల అధ్యక్షుడు చందన శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన చెన్నాల అనిల్‌రెడ్డి, భాస్కర్, లక్ష్మారెడ్డి, బాలక్రిష్ణ, రాజలింగం, స్వామిలను ఉపాధ్యక్షులుగా, మండల యువ మోర్చా అధ్యక్షుడిగా చెట్కూరి మహిపాల్, దళిత మోర్చా అధ్యక్షుడిగా దేవునిపల్లి పోచయ్యలను ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా రవి, అమృతరావు, కార్యదర్శులుగా శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌గౌడ్, సాయిరెడ్డి, భాస్కర్, నరేశ్, కోశాధికారిగా వీరేశంలను నియమించారు. అనంతరం వారిని సన్మానించారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు చెక్కుల ప్రదానం

నిజామాబాద్ సిటీ: దసరా సీజన్ నేపథ్యంలో ఆర్టీసీ 'లక్కీడ్రా' కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ వరకు లగ్జరీ, సూపర్ లగ్జరీ, రాజధాని బస్సుల్లో ప్రయాణించిన వారికి డ్రాలో పాల్గొనే అవకాశం కల్పించింది. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోగల ఆర్‌ఎం కార్యాలయంలో ఇటీవల డ్రా తీయగా, విజేతలకు ఏసీపీ రాజా వెంకటరెడ్డి శుక్రవారం చెక్కులు అందించారు. మొదటి బహుమతి చంద్రయ్యకు రూ.25 వేలు, రెండో బహుమతి షేక్ బాబర్‌కు రూ.15 వేలు, మూడో బహుమతి రాంప్రసాద్‌కు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం జ్యోత్స్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, పరమాత్మ, ఆనంద్ బాబు, డీఎం–1 ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలపై వెల్లువెత్తిన నిరసన

- 'సాక్షి'పై కక్ష సాధింపు మానుకోవాలని డిమాండ్
- కామారెడ్డి, బాన్సువాడ, నిజాంసాగర్‌లో జర్నలిస్టు, ప్రజా సంఘాల ఆందోళనలు
- జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన



నిజాంసాగర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



కామారెడ్డి టౌన్/ బాన్సువాడ/బాన్సువాడ రూరల్ / నిజాంసాగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాక్షి దిన పత్రిక, ఎడిటర్ ధనంజయ రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసుల నమోదుపై ప్రజా సంఘాలు, జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామారెడ్డి జేఏసీ కన్వీనర్ జగన్నాథం మాట్లాడుతూ ఏపీలో నకిలీ మద్యం దందాపై వార్తలు రాస్తున్నారనే కక్ష సాధింపుతో సాక్షి, జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. టీపీటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్, వెంకటి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం సాక్షి గొంతుకను నొక్కే కుట్ర చేస్తున్నారని, పత్రికా స్వేచ్ఛను హరించాలని చూస్తే ప్రజా ఆగ్రహానికి గురవుతారన్నారు. తక్షణమే దాడులు నిలిపివేసి, తప్పుడు కేసులను కొట్టివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న సాక్షిపై, జర్నలిస్టులపై వరుసగా దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. సీపీఎం, సీపీఐల జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, దశరత్ మాట్లాడుతూ సాక్షిపై దాడులు చేయడం రాజ్యాంగాన్ని అవమానపరచడమే అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు నర్సింలు, బాలరాజు, విఠల్, ఆబిద్, ముదాం శంకర్,వినయ్, అన్వర్, శ్రీకాంత్, ప్రభు, ఆశన్న, సత్యం పాల్గొన్నారు.

♦ సాక్షి దినపత్రికకు మద్దతుగా బాన్సువాడలోని అంబేడ్కర్ చౌరస్తాలో పాత్రికేయులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో కూటమి సర్కారు సహకారంతో కొనసాగుతున్న నకిలీ మద్యం దందాపై సాక్షిలో వస్తున్న వరుస కథనాలను నిరోధించడానికి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిని నోటీసుల పేరుతో పోలీసులు వేధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌గౌడ్, గంట చంద్రశేఖర్, సీపీఎం నాయకుడు ఖలీల్, బీఆర్‌ఎస్ నాయకులు సాయిబాబా, బోడ చందర్, ఇసాక్, మహేశ్, జర్నలిస్టులు గిరిధర్, అంబిల్‌పూర్ రాజు, పోశీరాం, జాడె గోపాల్, హన్మాండ్లు, సతీశ్, శ్రీనివాస్, మధుసూదన్, ప్రమోద్‌రెడ్డి,బర్ల సుధాకర్, అహ్మద్, సుధీర్, అశ్వాఖ్, సుందర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

♦ సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డిపై ఏపీ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడంపై వర్కింగ్ జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం నిజాంసాగర్ తహసీల్దార్ భిక్షపతికి జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. నకిలీ మద్యం తయారీపై వార్తలు ప్రచురించడంతో ఏపీ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తూ పత్రికాస్వేచ్ఛను కాలరాస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బాలరాజు, రెడ్డిశెట్టి భాస్కర్, జునేద్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు సరికాదు..



పత్రికా స్వేచ్ఛను హరించేలా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికం. విచారణపేరుతో చేపడుతున్న నిర్బంధ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. చంద్రబాబు ప్రభుత్వం పత్రికాస్వేచ్ఛను అణగదొక్కేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు. ప్రజాస్వామిక వాదులంతా సాక్షికి మద్దతుగా నిలవాలి.

– ఖలీల్, సీపీఎం డివిజన్ నాయకులు, బాన్సువాడ

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



సాక్షి దినపత్రిక గొంతునొక్కే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి దినపత్రికపై అక్కడి కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడటం షరామామూలైపోయింది. పత్రికాస్వేచ్ఛను కాలరాసే కార్యక్రమాలను ఇకనైనా ఆపకపోతే ప్రజాసంఘాల మద్దతుతో కూటమి ప్రభుత్వంపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.

– సుధాకర్‌గౌడ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు, బాన్సువాడ

కుట్రలకు తెరలేపారు



తెలంగాణ ఉద్యమంపై చంద్రబాబు విషం చిమ్మినట్లే.. నేడు సాక్షి కథనాలపై ప్రజలకు సమాధానం చెప్పుకోలేక పోలీసులను ఉసిగొల్పి కుట్రలకు తెరలేపారు. కుట్రలు, కుతంత్రాలు ఆపకుంటే చంద్రబాబుకు తెలంగాణలో పట్టిన గతే ఆంధ్రప్రదేశ్‌లోనూ పడుతుంది. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కల్గించే పనులు ఇకనైనా మానుకోవాలి. – అంబిల్‌పూర్ రాజు, టీయూడబ్ల్యూజే, జిల్లా ప్రధాన కార్యదర్శి, కామారెడ్డి

కేసులు ఉపసంహరించుకోవాలి



ఏపీలో నకిలీ మద్యం కుంభకోణాన్ని వెలుగులోకి తేవడంతోనే సాక్షిని అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోంది. విచారణల పేరుతో రిపోర్టర్లను, ఎడిటర్‌ను ఒత్తిడికి గురిచేయడం పత్రికాస్వేచ్ఛకు భంగం కల్గించడమే. పోలీసులు జర్నలిస్టులపై పెట్టిన అక్రమకేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– బోడ చందర్, బీఆర్‌ఎస్ గిరిజన నాయకుడు, బాన్సువాడ

కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ పార్టీ అసత్యపు ప్రచారానికి బాధ్యులుగా చేస్తూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు శుక్రవారం జిల్లా అదనపు ఎస్పీ నర్సింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేక సామాజిక మాధ్యమాల్లో విద్వేషాన్ని, రెచ్చగొట్టే విధంగా అసత్యపు పోస్టులు పెడుతున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు గుడుగుల శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్, రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక పారదర్శకంగా జరగాలి



వినతిపత్రం అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక పారదర్శకంగా ఎన్నుకోవాలని ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు రాజ్‌పాల్ కరోలాను టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కామారెడ్డి నియోజకవర్గంలో జిల్లా అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని చెప్పారు. పాత అధ్యక్షుడికి ఏవైనా పదవులు వచ్చేంత వరకు.. జిల్లా అధ్యక్షుడిగా ఉంటారని ప్రకటించడం ఏకపక్ష నిర్ణయం సరికాదన్నారు. పార్టీ బలోపేతం దిశగా ఎన్నిక జరగాలని కోరారు.

ఎక్కడి వడ్లు అక్కడే

- కేంద్రాలు ప్రారంభమైనా కొనుగోలు చేయని వడ్లు
- వాతావరణంలో మార్పులతో రైతుల దిగులు



బీబీపేటలో కొనుగోలు కేంద్రంలో వడ్లు ఆరబోసిన రైతులు

బీబీపేట: ఈ ఏడాది జిల్లా అంతటా భారీ వర్షాలు కురవడం ఆశించిన మేర పంటలు పండడంతో నెల రోజుల ముందే పంట చేతికి వచ్చింది. దీంతో ఇప్పటికే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వడ్లను రైతులు తీసుకువచ్చారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వం 15 రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను అధికారికంగా ప్రారంభించింది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క కేంద్రం వద్ద కూడా వడ్లను కొనడం ప్రారంభించలేదు. దీంతో రైతుల్లో భయాందోళన నెలకొంది. వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రోజుకో మాదిరిగా వాతావరణం ఉండడంతో రైతులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. ఒకరోజు ఉక్కపోత, మరో రోజు మేఘాలు కమ్మడంతో రైతులకు కూడా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ పరిధిలో 6 కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ పరిధిలో 5 కేంద్రాలు ఉండగా ఎక్కడా కూడా వడ్లను కొనడం లేదు. ఇప్పటికే కేంద్రాల వద్దకు వడ్లు చేరడంతో పాటు రైతులు ఆరబెడుతున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో 11 కేంద్రాల్లో 1,51,658 క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేయగా ఈ ఏడాది ఇంకా ఎక్కువగానే వచ్చే అవకాశాలున్నట్లు అంచనా వేస్తున్నారు. అధికారులు త్వరితగతిన కొనుగోళ్లు చేపడితే తప్ప రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాలి



కలెక్టరేట్‌లో టీఎన్జీవోస్, టీజీవో నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

కామారెడ్డి టౌన్: బీసీలకు 42శాతం అమలు చేయాలని తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని కామారెడ్డి బీసీ కులాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడారు. రాష్ట్ర బంద్‌తో బీసీల తడాఖా చూపిస్తామన్నారు. ఈ బంద్‌లో వ్యాపార, వాణిజ్య, వర్తక సంఘాలు, విద్యా సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌కు తరలివెళ్లి టీఎన్జీవోస్, టీజీవో సంఘాల నాయకులకు వినతిపత్రాలను అందజేశారు. బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. బీసీ కులాల జేఏసీ నాయకులు నాగరాజు, కుంబాల లక్ష్మణ్, శివరాములు, పండ్ల రాజు, కుంబాల రవి, నాగరాజ్ గౌడ్, భూమన్న, కొత్తపల్లి మల్లన్న, గైని శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే బంద్‌కు బీఆర్‌ఎస్, బీఎస్పీ, బీసీ టీయూ, ఎమ్మార్పీఎస్ మద్దతు తెలిపాయి.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన బేగంపూర్ గ్రామ శివారులోని కింద చెరువులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కాస్లాబాద్ గ్రామానికి చెందిన పిసుకే నడిపి సాయిలు (50)కు గతంలోనే వివాహం జరుగగా, భార్యతో విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. తరచుగా తమ్ముడి ఇంటికి వెళ్లివస్తుండేవాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం సీతాఫలాలను తీసుకురావడానికి తమ్ముడి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. కానీ అతడు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టినా, ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం బేగంపూర్ గ్రామ శివారులోని కింది చెరువులో అతడి మృతదేహం లభ్యమైంది. సాయిలుకు గత కొన్నిరోజులుగా కళ్లు సరిగా కనిపించడంలేదు. చెరువు కట్ట పైనుంచి అతడు నడుచుకుంటు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి, ఈతరాక మృతిచెందినట్లు మృతుడి తమ్ముడు లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

కరెంట్‌షాక్‌తో బాలుడి ..



సయ్యద్ చోటు మృతదేహం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజర సమీపంలో ఓ బాలుడు ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూర్ జిల్లా రామసముద్రం గ్రామానికి చెందిన సయ్యద్ చోటు(16)అనే బాలుడు తన తల్లి ముంతాజ్‌తోపాటు గ్రామానికి చెందిన మరికొంత మందితో కలిసి బాతులను మేపేందుకు ఈనెల 12న మండలానికి వచ్చారు. కాగా శుక్రవారం ఉదయం మండలంలోని నాగిరెడ్డిపేట శివారులో బాతుల మంద నుంచి కొన్ని బాతులు విడిపోయి పక్కకు పోతుండగా చోటు వాటిని మందలోకి తోలుతున్నాడు. ఈక్రమంలో పొలంలోని స్టార్టర్ బాక్స్ వద్ద ఉన్న కరెంట్‌వైరుకు అతడు తగిలి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం మండలకేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట గ్రామంలోని ఓ ఇంట్లో గురువారం రాత్రి పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,390 నగదు, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని వివరించారు.

వెలుగుల మాటున ప్రమాదం



బాన్సువాడలో విక్రయానికి సిద్ధంగా ఉన్న టపాకాయలు

- బాణా సంచా కాలుస్తున్నప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు

బాన్సువాడ : చిన్నా పెద్ద తేడా లేకుండా ఆనందోత్సాహాలతో గడిపే దీపావళి పండుగను ఈ నెల 20న లక్ష్మి పూజలు, 21న పాడ్యమిని జరుపుకోనున్నారు. ఆ రోజు బాణసంచా కాలుస్తూ ఆనంద డోలికల్లో ఓలలాడుతారు. అయితే ఆ వెలుగుల మాటున ప్రమాదం పొంచి ఉంటుంది. టపాసులు కాల్చే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. జిల్లా వ్యాప్తంగా టపాసుల వ్యాపారం మొదలైంది. పోలీసు, రెవెన్యూ, ఫైర్, ట్రాన్స్‌కో శాఖల అధికారులు నిత్యం టపాసుల విక్రయ కేంద్రాలను పర్యవేక్షిస్తుండాలి.

ఇవి పాటించాలి..

- గ్రామీణ ప్రాంతాల్లో గడ్డి వాములు, పూరి గుడిసెలు ఉంటాయి. అక్కడ రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటివి కాల్చరాదు. టపాకాయల పనితీరు, వెలిగించాల్సిన విధానం తదితర అంశాలపై పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలి.
- పెద్దల పర్యవేక్షణలో పిల్లలతో టపాసులు కాల్పించాలి. రోడ్లపై పేల్చితే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది.
- వ్యాపారులు జన సంచారం లేని, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలి.
- టపాసులు విక్రయించే వ్యాపారులు రెవిన్యూ, పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్/పంచాయితీ, విద్యుత్ శాఖ తదితర శాఖల అధికారుల నుంచి అనుమతులు పొందాలి.
- విక్రయ ప్రాంతంలో విధిగా ఇసుక, నీరు, కార్బన్ డయాక్సైడ్ వాయువును అందుబాటులో ఉంచుకోవాలి.
- దుకాణాల సమీపంలో ఎవరూ సిగరెట్లు, బీడీలు కాల్చకూడదని బోర్డులు ఏర్పాటు చేయాలి.
- సెల్‌ఫోన్‌లో మాట్లాడకుండా చర్యలు తీసుకోవాలి. దుకాణాల మధ్య కనీసం 10 అడుగుల దూరం ఉండాలి.
- మందుగుండు సామగ్రి విక్రయించే కేంద్రాల్లో విద్యుత్ వైరింగ్ సక్రమంగా ఉండేలా చూడాలి.
- ప్రతీ దుకాణం ఎదుట అగ్ని మాపక కేంద్రాల ఫోన్ నంబర్లు ఉండాలి.

అనుమతులు తీసుకోవాలి

టపాకాయలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడైనా అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తే చర్యలు తప్పవు. – తుల శ్రీధర్, సీఐ, బాన్సువాడ

చికిత్స పొందుతూ మరో ఇద్దరి మృతి

- ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఒకే కుటుంబంలోని ముగ్గురు
- రెండు రోజుల క్రితం తండ్రి, తాజాగా తల్లీకుమారుడు మృత్యువాత

నిజామాబాద్‌అర్బన్: ఒకే కుటుంబంలోని ముగ్గురు ఇటీవల ఆత్మహత్యకు యత్నించగా, ఒకరు ఘటన మరుసటి రోజు మృతిచెందారు. చికిత్స పొందుతున్న మరో ఇద్దరు కూడా మృతిచెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్‌కు చెందిన దాసరి కిషన్‌కు భార్య నాగమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడికి వివాహం జరుగగా, పెద్ద కుమారుడికి వివాహం జరుగలేదు. దీంతో తనకు పెళ్లి చేయడం లేదని కోపంతో పెద్దకుమారుడు వంశీ మంగళవారం తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. ఈక్రమంలో వంశీ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే ఆ గడ్డి మందు డబ్బాను తల్లి తీసుకొని తాగింది. అనంతరం ఆమె వద్ద నుంచి తండ్రి తీసుకొని తాగాడు. దీంతో ముగ్గురు అపస్మారకస్థితిలో ఉండగా, స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. కిషన్ నగరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వంశీ గురువారం రాత్రి మృతిచెందగా, శుక్రవారం నాగమణి మృతిచెందారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో టౌన్ ఎస్సై ముజాహిద్ తెలిపారు.

గోవుల అక్రమరవాణా అడ్డగింత



భిక్కనూరు: మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు లారీలో అక్రమంగా తరలిస్తున్న గోమాతలను శుక్రవారం మండలంలోని బస్వాపూర్ గ్రామం జాతీయ రహదారిపై గోసంరక్షణ సమితి ప్రతినిధులు పట్టుకున్నారు. గోవుల తరలింపును గమనించి వారు హైవేపై లారీని వెంబడించారు. లారీని నిలిపి అందులో చూడగా 53 ఆవులు ఉన్నట్లు గుర్తించి, పోలీసులుకు సమాచారం అందించారు. ఎస్సై అంజనేయులు కేసు నమోదు చేసుకొని, మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న గోశాలకు ఆవులను తరలించారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

ఎల్లారెడ్డి: మండలంలో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, నలుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. జడ్జి వారికి ఒకరోజు జైలు శిక్షతోపాటు పదకొండు వందల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు.



దీపావళి వెనుక ఉన్న పురాణాలు

పిల్లలూ... మీకు ఇష్టమైన పండుగలలో దీపావళి ముందు వరుసలో ఉంటుంది కదూ. దీపాలు వెలిగించడం, టపాసులు పేల్చడం, పిండివంటలను ఆరగించడం... భలే సరదా. అయితే అసలు దీపావళి పండుగ ఎందుకు జరుపుకుంటాం, ఈ వేడుక వెనకున్న కథలేంటి తెలుసుకుందాం.

నేటి 'సాక్షి ఫ్లస్' కిడ్స్ ఈపేపర్‌లో

యువ హవా

ఘనమైన కుటుంబ వ్యాపార నేపథ్యం ఉన్నంత మాత్రాన...
'విజయం అనివార్యం' అని చెప్పడానికి లేదు.
అంకితభావం, కష్టం ఉంటేనే
విజయం సొంతం అవుతుంది.
ఘనమైన కుటుంబ వ్యాపారనేపథ్యం
లేనంత మాత్రాన...
'విజయం దూరం' అని చెప్పడానికి లేదు.
ఆసక్తికి అంకితభావం, కష్టం తోడైతే
విజయం సొంతం అవుతుంది.
దీనికి తాజా ఉదాహరణ... అవెండస్ వెల్త్-హురున్ ఇండియా-2025 జాబితా.
35 ఏళ్ల లోపు ప్రతిభావంతులైన 155 మంది యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు వెల్త్-హురున్ ఇండియా జాబితాలో చోటు సాధించారు.
వీరిలో...
వారసత్వ బాధ్యతకు తమ శక్తియుక్తులను జోడించి తమదైన గుర్తింపు తెచ్చుకున్నవారు ఉన్నారు. కొన్ని ఉత్పత్తులలో లోపాలు కనిపెట్టి లోపాలు లేని, సౌకర్యవంతమైన ప్రొడక్ట్స్ కోసం ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారి విజయం సాధించిన వారూ ఉన్నారు... వారిలో కొందరు యంగ్ ఫిమేల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి..


అవంతిక సరౌగి

దేశంలో తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్

చెరకు, బయోప్లాస్టిక్‌కు సంబంధించిన ఆపరేషన్‌లలో యువ మార్గదర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది అవంతిక సరౌగి. కాలిఫోర్నియాలో చదువుకున్న అవంతిక తమ బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్ లిమిటెడ్ (బీసీఎంఎల్)ను పీఎల్‌ఏ (పాలీలాక్టిక్ యాసిడ్) తయారీ సౌకర్యాన్ని అందించే కంపెనీగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో ఉంది. ఇది మన దేశంలోని మొట్ట మొదటి బయోప్లాస్టిక్ ప్లాంట్ కానుంది.

పీఎల్‌ఏ అనేది చెరకు పునరుత్పాదక వనరుల నుండి తయారైన బయో ఆధారిత, కంపోస్టబుల్, తక్కువ ఉద్గారాల ప్లాస్టిక్. దీనిని సాధారణంగా ప్యాకేజింగ్, త్రీడి ప్రింటింగ్‌లో ఉపయోగిస్తారు.

మన దేశంలోని ఈ తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్ వల్ల బీసీఎంఎల్ లాభాల బాటలో పయనించనుంది. టర్నోవర్ పెరగనుంది. పర్యావరణ అనుకూలంగా కూడా మారనుంది.

తరగతి గదిని మార్చేలా


పరిత పరేఖ్

వినూత్నమైన ఆలోచన విధానంతో విద్యా, సాంకేతిక రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ పరిత పరేఖ్. బ్రౌన్ యూనివర్శిటీలో చదువుకుంది. బ్రౌన్ తరువాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో 'ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్'పై మాస్టర్స్ చేసింది. స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకునే రోజుల్లో పిల్లల విద్యావిధానం మీద దృష్టి పెట్టేది. స్టాన్‌ఫోర్డ్‌లో చేసిన పరిశోధనలు, నేర్చుకున్న ఆధునిక సాంకేతిక విషయాలు ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించాయి.

కట్టింగ్-ఎడ్జ్ ఎడ్యుకేషనల్ టెక్ ప్లాట్‌ఫామ్ 'టొడెల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించింది పరిత. మూస బోధన పద్ధతులకు అతీతంగా ఆధునిక బోధన పద్ధతులు, ఆలోచనలతో 'టొడెల్' ప్లాట్‌ఫామ్‌కు రూపకల్పన చేసింది. 'టొడెల్' ప్రభావంతో చాలా బడులలో ఉపాధ్యాయుల బోధన పద్ధతి మారింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంప్రదాయ, ఆధునిక విద్యాబోధనలో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి 'టొడెల్' కృషి చేస్తోంది.

విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించే ప్రణాళికలతో 'టొడెల్' విద్యాప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సాధించింది.


మీనా మార్గరెట్

సక్సెస్‌ఫుల్ యూఎస్పీతో...

ప్రారంభ కష్టాల మాట ఎలా ఉన్నా... ఉమెన్ యాక్టివేర్ 'బ్లిస్‌క్లబ్' మార్కెట్‌లో నిలుదొక్కుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఈ ఆన్‌లైన్ బ్రాండ్ ఆ తరువాత రెండు ఆఫ్‌లైన్ స్టోర్‌లను కూడా లాంచ్ చేసి విజయం సాధించింది. 'మార్కెట్‌లో ఎన్నో బ్రాండ్‌లు ఉన్నాయి కదా. మీ ప్రత్యేకత ఏమిటి?' అనే ప్రశ్న 'బ్లిస్‌క్లబ్' ఫౌండర్, సీయీవో మినూ మార్గరెట్ ముందు వచ్చి నిల్చుంది. సిగ్నేచర్ ఫ్యాబ్రిక్స్, వినూత్నమైన ప్రొడక్ట్ డిజైన్‌ను తమ కంపెనీ యూఎస్పీగా చేసుకొని విజయం సాధించింది మార్గరెట్.

నేషనల్ లెవెల్ ఫ్రిస్బీ ప్లేయర్ అయిన మినూ మార్గరెట్ యాక్టివేర్‌కు సంబంధించిన డీసెంట్ ఆప్షన్స్ గురించి ఆలోచిస్తున్నప్పుడు 'బ్లిస్‌క్లబ్' స్టార్టప్ ఆలోచనవచ్చింది.

'యాక్టివేర్ రంగంలోని కంపెనీలు డిజైన్ ఫస్ట్ విధానాన్ని అనుసరిస్తాయి. మేము మాత్రం ఈ విధానానికి దూరంగా ఉన్నాం. బ్లిస్‌క్లబ్‌కు డిజైన్ క్లబ్ లేదు. ప్రొడక్ట్ ఇంజినీరింగ్ టీమ్ మాత్రమే ఉంది. ఈ టీమ్ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం యాక్టివేర్ సౌలభ్యానికి సంబంధించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడం. ఉదాహరణకు చెన్నైలోని ఒక మహిళ గురించి. వేడి వాతావరణంలో ఆమెకు లెగ్గింగ్స్ ధరించడం కష్టమయ్యేది. ఇలాంటి సమస్యను దృష్టిలో పెట్టుకొని వేడివాతావరణంలో కూడా సౌకర్యంగా ఉండే లెగ్గింగ్స్‌ను డిజైన్ చేశాం' అంటుంది మార్గరెట్.


నీతూ యాదవ్ – కీర్తి జాంగ్రా

చిన్న గదిలో మొదలై... కోట్ల టర్నోవర్ వరకు

బెంగళూరులోని చిన్న గదిలో మొదలైన 'యానిమల్' రూ.550 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ స్థాయికి చేరింది. ఐఐటీ-ఢిల్లీలో చదువుకున్న కీర్తి జాంగ్రా, నీతూ యాదవ్‌ల బ్రెయిన్ చైల్డ్ 'యానిమల్'. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అవ్యవస్థీకృతంగా ఉన్న మన దేశంలోని పశువుల మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

పశువుల క్రయవిక్రయాలలో 'యానిమల్' యాప్ కీలక పాత్ర పోషిస్తోంది. తమ స్టార్టప్‌ను ప్రారంభించడానికి ముందు సర్వే నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు కీర్తి, నీతూ యాదవ్. డైరీ ఇండస్ట్రీలో కీలకమైన మార్పు తేవాలనుకున్న కీర్తి, నీతూ యాదవ్‌లు 'యానిమల్' యాప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా మనం ఉన్న చోటు నుంచే వందల కిలోమీటర్‌ల దూరంలో పశువుల క్రయ విక్రయాలు జరుగుతున్న ప్రదేశం తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

వంటిల్లు

తియ్యటి వేడుక

ముచ్చటగా అలంకరించిన లోగిళ్లు
అందంగా ముస్తాబైన చిన్నా పెద్దలు
ఓ వైపు దీప కాంతులు
మరోవైపు బాణాసంచా పేలుళ్లు
ఆనందాలు విప్పారుతుండగా
తియ్యని రుచులు నోరారా ఆస్వాదిస్తుంటే
వేడుకంతా నట్టింట్లో కొలువుదీరినట్టే ఉంటుంది.
రెట్టింపు ఆనందాలను పంచడానికి
వంటిల్లు తీపి వంటకాలను
సిద్ధం చేస్తూనే ఉంటుంది.
ఎక్కువ శ్రమ లేకుండా పండగవేళ
తియ్యని రుచులను సులువుగా చేసేద్దాం.
ఇంటిల్లిపాదికి ఆనందాన్ని పంచేద్దాం..



సూజీ హల్వా

కావలసినవి: సూజీ (బొంబాయి రవ్వ) – కప్పు; నీళ్లు – 2 కప్పులు; పంచదార – కప్పు; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; జీడిపప్పు, కిస్‌మిస్ – అవసరమైనంత.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడిపప్పు, ద్రాక్ష వేయించాలి. ● వాటిని తీసి, అదే నెయ్యిలో సూజీ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● మరో పాత్రలో నీరు మరిగించి, రవ్వ పోస్తూ, కలపాలి. ● రవ్వ ఉడికిన తర్వాత పంచదార కలిపి తర్వాత యాలకుల పొడి వేసి కలపాలి. ● చివరగా వేయించిన కాజూ, ద్రాక్ష వేసి మిక్స్ చేయాలి.



గులాబ్ జామూన్

కావలసినవి: రెడీమేడ్ జామూన్ మిక్స్ – కప్పు; నీళ్లు/పాలు – అవసరమైనంత (జామూన్ మిక్స్ కలపడానికి); పంచదార – ఒకటింపావు కప్పులు; నీళ్లు – కప్పు; యాలకుల పొడి – చిటికెడు.

తయారీ: ● పంచదార, నీళ్లు కలిపి, మరిగించి సిరప్ తయారు చేయాలి. దాంట్లో చిటికెడు యాలకుల పొడి కలపాలి ● జామూన్ మిక్స్‌కి కొంచెం నీళ్లు లేదా పాలు జోడించి మృదువుగా కలపాలి ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, ఉండలు చేయాలి ● బాణలిలో నూనె పోసి వేడయ్యాక, సిద్ధంగా ఉంచుకున్న ఉండలు వేసి, వాటిని గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి ● వేయించిన జామూన్లను వేడి సిరప్‌లో వేసి, రెండు గంటలు నాననివ్వాలి.



రైస్ పుడ్డింగ్ / పాయసం

కావలసినవి: బియ్యం – పావు కప్పు; పాలు – 3 కప్పులు; పంచదార – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; యాలకులు, కిస్‌మిస్ – అవసరమైనంత; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యం కడిగి, కొద్దిగా ఉడికాక పాలు పోసి, మెల్లిగా మరిగించాలి. ● బియ్యం పూర్తిగా ఉడికాక పంచదార కలపాలి. ● యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి.



బేసిన్ లడ్డూ

కావలసినవి: బేసన్ (సెనగపిండి) – కప్పు; నెయ్యి – పావు కప్పు; పంచదార పొడి – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేసి, వేడి చేయాలి. మంట బాగా తగ్గించి, దాంట్లో శనగపిండి వేసి, మెల్లగా బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● చల్లారిన తర్వాత పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి. ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, చేతులతో లడ్డూలు చేయాలి.



వామ్మో.. ఏ(ఐ)డడుగులు..!

మన పురాతన తాటాకు శాసనాల గ్రంథాల్లో అన్నీ ఉన్నాయో లేవోగానీ... మన సినిమాల్లో మాత్రం సకల విజ్ఞాన శాస్త్రాలూ ఉన్నాయి. అందుకు నిదర్శనమే మనదైన పానిండియన్ సూపర్‌హిట్ బ్లాక్‌బస్టర్ సినిమా 'రోబో'!

ఏ అద్భుత ముహూర్తాన మన డైరెక్టర్ శంకర్ 'రోబో' తీశాడోగానీ... లోకమంతటా అవే వింతలు అచ్చం అలాగే జరుగుతున్నాయి. ఉదాహరణకు...

ఇక్కడి మన సినిమాలో హ్యూమనాయిడ్ రోబో కాస్తా మానవ మానస వికాసాలూ, వికారాలూ ఒంటబట్టించుకుని 'రోబో సేపియన్' అవుతాడా! అలా అవ్వగానే ఆ 'టాయ్'ఫ్రెండు కాస్తా హీరోయిన్‌కి 'బాయ్'ఫ్రెండుగా మారి... అచ్చం మన మానవ కుర్రాళ్లలాగే... తనను ప్రేమించని అమ్మాయి మీద యాసిడ్లా గట్రా విసిరేంత క్రూరమైన 'సెల్ఫ్‌స్టైల్డ్ లవర్‌బా(టా)య్'గా మారిపోతాడు కదా.

అక్కడ అమెరికాలోని ఒహాయో రాష్ట్ర చట్టనిపుణులు బహుశా 'రోబో' సినిమా చూసి హడలిపోయి ఉంటారేమో... మానవ మేధకూ, కృత్రిమ మేధస్సుకూ మధ్య వివాహాలు వద్దంటే వద్దంటూ గొడవ గొడవ చేస్తున్నారు. అంతేనా... ఆ మేరకు ఓ చట్టం తీసుకువచ్చేందుకు బిల్లు కూడా ప్రిపేర్ చేశారు.

అదే డైరెక్టర్ శంకర్‌గారి ఆయొక్క అదే 'రోబో' సినిమాలో... ''ఇనుములో ఓ హృదయం మొలిచెలే'' పాటనుంచి స్ఫూర్తి పొందినట్టుగా... ఇప్పటికే మన పొరుగు దుండగీడైన చైనావాడు 'దివిరి ఇసుకన తైలంబు' రీతిగా దివిరి ఇనుమున గర్భసంచి నుంచి చిన్నారి పాపలను రేపీపాటికి తీసిస్తానంటూ తొడలుగొడుతూ, హడలగొడుతున్నారన్న సంగతి తెలిసిందే. అంతే కాదు... రోబోలకు సీమంతాలవీ గట్రా చేసేసి కృత్రిమ 'ఊంబ్'ల లోంచి ఉంగా ఉంగా పాపాయిలను పుట్టిస్తానంటూ సవాళ్లు విసురుతున్నారు కూడా.

అమిత వింతలకు నెలవైన అమెరికాలో... ఈ చిత్ర విచిత్రాలన్నీ చూస్తున్న ఒహాయో రాష్ట్రపు మేధావులు భయపడిపోతున్నారేమో... ఆ ఆందోళనతో స్థిమితంగా ఉండలేక... బహ్మాండమైన ఓ వివాహ నిషేధ చట్టాన్ని తెచ్చేందుకు నిశ్చయించుకున్నారు. ఆ మేరకు బిక్కుబిక్కుమంటూ బిల్లొకదాన్ని అక్కడి చట్టసభల్లో ప్రవేశపెట్టబోతున్నారు కూడా! దీనికి కారణమేంటంటే... అక్కడి కుర్రకారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెళ్లిళ్లు చేసుకునేందుకు తెగ ఉత్సాహపడిపోతున్నారట!

హాయ్యో...! ఇప్పటికే అతి మేధావులైన మానవులూ, అమితమైన మేధస్సుల 'కృత్రిమ మేధ' మధ్య పెళ్లిళ్లు జరిగితే... రేపు సదరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కాస్తా పవరాఫ్ ఆటార్నీలంటూ పవర్‌పట్టా తీసుకోవడం, పార్ట్‌నర్‌తో చెట్టాపట్టాలే కాకుండా, లీగల్ వ్యవహారాల్లోకి దూరి, అసలు నిపుణులు తట్టాబుట్టా సర్దుకునేలా, చెట్టూపుట్టా పట్టుకుపోయేలా, బెదిరీ చెదిరీ పోయేలా చేస్తాయేమోనని హడలెత్తుతున్నారు 'ఓహాయో రాష్ట్ర'పు చట్ట నిపుణులు.

అందుకే... మనుషులకూ, యంత్రాలకు మధ్య పెళ్లి మంత్రాలు వద్దంటే వద్దంటూ పట్టుపడుతున్నారు. మానవులూ, యాంత్రాల మధ్య మనువులు వద్దంటూ వాదిస్తున్నారు. ఇది 'యంత్రమాత్రమూ' తగదంటూ బల్లగుద్ది మరీ శాసిస్తున్నారు మన ఒహాయో స్టేట్ రిప్రజెంటేటివూ, రిపబ్లికన్ మెంబరూ అయిన మిస్టర్ 'థాయిడస్ క్లాగెట్' గారు!

అలనాడెప్పుడో బ్రహ్మంగారు చెప్పిన వింతలన్నీ అక్కడా ఇక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడీ నేపథ్యంలో ఈ పుట్టు తెలివితేటలున్న మన మానవాళీ... పెట్టు తెలివితేటలున్న రోబోయంత్రాళీ... కలగలిసి సంకరమైతే... రేపు భవిష్యత్తులో సకల 'అతి'తెలివితేటలున్న బుజ్జిబుజ్జి రోబో-కంగాళీలకు ఆస్కారముంటుందేమోనని అనుమానిస్తున్నారు.

అచ్చం రోబో సినిమాలోలాగే... రేపెప్పుడైనా పొరబాటున ఆ 'చిట్టి' చిట్టి రోబోలకు విలనీయులైన ఏ అడ్డమైన సైంటిస్టులో 'రెడ్డు చిప్పు' పెడితే... అప్పుడది మన మానవాళి చేతికి 'డేంజరు చిప్పే'ననేమోనంటూ ఇన్నిరకాల ఆంక్షలూ, హాహాకారాలంటూ లోకంలోని ప్రజలంతా తెగ చెవులు కొరుక్కుంటున్నారన్నది అభిజ్ఞ వర్గాల అతి రహస్య భోగట్టా.

– యాసీన్


ఫొటోలు: (వ్యాపార సౌజన్యం)

ధన త్రయోదశి

ఆరోగ్యమస్తు ధనప్రాప్తిరస్తు

నేడు ధనత్రయోదశి. సాధారణంగా ధన త్రయోదశి అనగానే బంగారం, వెండి, ఇతర గృహోపకరణాలు కొనడం అందరూ చేసేదే. అయితే ధనత్రయోదశి ప్రాశస్త్యాన్ని తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ఆ కథ తెలుసుకుందాం.

దేవతలు, దానవులు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలుకుతున్న సమయంలో ఆ క్షీరసాగరం నుంచి శ్రీ మహాలక్ష్మి జన్మించింది. అంతే కాదు సంపదలను ప్రసాదించే కల్పవృక్షం, కామధేనువు, దేవవైద్యుడు ధన్వంతరి కూడా శ్రీ మహాలక్ష్మితో పాటే జన్మించారు. ఆ రోజు ఆశ్వయుజ బహుళ త్రయోదశి. శ్రీమహాలక్ష్మి ..., ధనానికి ప్రతిరూపం. అందుకే., ఆమె జన్మదినమైన ఈ ఆశ్వయుజ కృష్ణ త్రయోదశిని.. 'ధన త్రయోదశి' అన్నారు.

ఎంత చదువు చదివినా.., ఎన్ని తెలివితేటలు ఉన్నా., శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లేకపోతే జీవితం గడపడం కష్టం. అందుకే.. సర్వ సంపత్ప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం సర్వ మానవాళి ఈ రోజున శ్రీమహాలక్ష్మిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, ఆమె ఆశీస్సులు అందుకుంటారు.

ధనానికి అధిదేవత 'శ్రీమహాలక్ష్మి. ధనానికి అధినాయకుడు ఉత్తర దిక్పాలకుడైన 'కుబేరుడు'. అందుకే ఈ ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మితోపాటు కుబేరుని కూడా ఆరాధిస్తారు. సాధారణంగా ఈ లక్ష్మీ పూజను సాయం సమయంలో ప్రదోష వేళలో చేసుకుంటే చాలా మంచిది.

లక్ష్మీ కుబేర వ్రతం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, వ్యాపార అభివృద్ధి అదే విధంగా నూతన వ్యాపారం ప్రారంభించబోయే వారు, ఉద్యోగ అభివృద్ధి కోరుకుంటున్నవారు, అప్పుల బాధలు ఉన్నవారు లక్ష్మీ కుబేర వ్రతాన్ని చేసుకోవడం వల్ల ఆయా బాధల నుంచి విముక్తి పొంది, అన్నింటా అభివృద్ధి జరుగుతుందని పెద్దలు చెబుతారు కాబట్టి ఈ వ్రతాన్ని చేయాలనుకుంటున్న వారు అక్షయ తృతీయ రోజు, ధన త్రయోదశి రోజు, కార్తీక శుక్ల పంచమి రోజు లేదా తొమ్మిది గురువారాలు లేక శుక్రవారాలు చేసుకోవచ్చు.

ధన్వంతరి జయంతి

దేవవైద్యుడు, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అంశావతారమైన ధన్వంతరి పాలసముద్రం నుంచి ఆవిర్భవించింది కూడా ధనత్రయోదశి నాడే. అందుకే ఈ పర్వదినాన చాలామంది ధన్వంతరిని కూడా పూజిస్తారు. ముఖ్యంగా ఆరోగ్యం బాగలేని వారు, ఆయుర్వేద వైద్య విధానం మీద నమ్మకం ఉన్న వారు శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన ధన్వంతరిని పూజించడం వల్ల ఆరోగ్యవంతులవుతారని చెబుతారు. ధన్వంతరి చేతిలో శంఖు చక్రాలతోపాటు ఔషధ భాండం లేదా అమృత కలశం, జలగ ఉంటాయి. జలగ శరీరంలో చేరిన చెడు రక్తాన్ని పీల్చివేసి ఆరోగ్యాన్నిస్తుందని ప్రతీతి. అందుకే ధన్వంతరి చేతిలో జలూకం అంటే జలగ ఉంటుంది.

నేడు శని త్రయోదశి కూడా. ధనత్రయోదశి నాడే శని త్రయోదశి కూడా రావడం చాలా విశేషం. అందువల్ల ఈ వేళ పాత వస్తువులు, పాత ఆలోచనలు, పాతదనాన్ని వదిలించుకుని, కొత్త వస్తువులు కొనుగోలు చేయటం, కొత్త ఆలోచనలు చేయటం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం చాలా మంచిది.

పితృదేవతాపూజకు కూడా ధనత్రయోదశి చాలా ప్రశస్తమైనది. ధనత్రయోదశి నాడు ఇంటిలో దీపాలు వెలిగించి, మన పెద్దవారిని తలచుకోవడం వల్ల వారి ఆశీర్వాదంతో శుభం చేకూరుతుందని పండితులు చెబుతారు. ఈ శుభవేళ అందరికీ కీడు తొలగి మేలు చేకూరాలని కాంక్షిద్దాం.

– డి.వి.ఆర్.

ఏఐ మ్యారేజ్ ప్రపోజల్

ప్రేమలేఖల నుంచి ఎస్ఎంఎస్‌ల వరకు లవ్, మ్యారేజ్ ప్రపోజల్స్ పలు రకాలు. తాజా విషయానికి వస్తే...ఒక కుర్రాడు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ను ఉపయోగించి ఫేక్ డిస్నీ-స్టైల్ ట్రైలర్ ద్వారా తన స్నేహితురాలికి మ్యారేజ్ ప్రపోజ్ చేశాడు. ఈ వీడియోకు 11 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.





ఈ వీడియోను ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీషేర్ చేస్తున్నారు.

'ది ఈజీయెస్ట్ యస్. యస్, ప్రపోజ్‌డ్ టు జె... యూజింగ్ ఏఐ' అని వీడియోకు కాప్షన్ ఇచ్చారు. వీడియో చివరలో 'విల్ యూ మ్యారీ మీ' అనే కామెంట్ కనిపిస్తుంది. ఇంతకీ ఆ అమ్మాయి 'యస్' చెప్పిందా? యస్!

'ది మోస్ట్ బ్యూటీఫుల్ మ్యారేజ్ ప్రపోజల్' అంటూ స్పందించారు నెటిజనులు.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో) అక్టోబర్ 17న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,34,990	1,35,150	1,32,770	1,35,150	1,32,500	1,33,090
బంగారం (22 క్యారెట్లు)	1,24,590	1,21,700	1,21,700	1,25,350	1,21,900	1,22,000
వెండి	1,90,000	1,81,000	2,03,000	1,81,000	1,81,000	2,03,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.